
www.hamsakalam.com
PRGI TGTEL/26/A3129

# హంస కలం వార్త

సంచలన తెలుగు దినపత్రిక
HAMSAKALAM VARTHA
ఎడిటర్ : వడ్ల మధుసూదన్ చారి




మేడ్చల్ మల్కాజిగిరి | సెప్టెంబర్ 11 శుక్రవారం 2026 | సంపుటి : 1 | సంచిక : 113 | పేజీలు : 8 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : వడ్ల మధుసూదన్ చారి
MEDCHAL ,MALKAJGIRI | FRIDAY AUGUST 11 2026 | VOL:1 | ISSUE: 113 | PAGES:8 | Rs. 4:00 | EDITOR:VADLA. Madhusudan chary

# బీఆర్ఎస్ 'విషప్రచారం'పై ఎదురుదాడి!

## 22వపై అసెంబ్లీలోనే వాస్తవాలు తేల్చుదాం: సీఎం రేవంత్ రెడ్డి




- కేసీఆర్ హయాంలోనే నిషేధిత భూముల జాబితా.. నాటి భూ దోపిడీని బయటపెడదాం
- ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి.. అర్హులైన ప్రతి ఓటును కాపాడాలి
- సభను అడ్డుకునేందుకు కేసీఆర్ కుట్ర చేశారని ఆరోపణ
- ఫీజు రీయింబర్స్‌మెంట్, పాలిటెక్నిక్ కాలేజీలపైనా చర్చ
- ఎల్‌నినో ప్రభావం.. విద్యుత్ డిమాండ్‌పైనా సభలో చర్చిద్దాం
- కలిసి పనిచేస్తే కుట్రలను ఛేదించగలం: భట్టి విక్రమార్క
- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- ఎస్ఐఆర్‌పై ఎమ్మెల్యేలు ప్రత్యేక దృష్టి పెట్టాలి: మహేశ్‌గౌడ్

22ఏ నిషేధిత భూముల జాబితాపై బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న విషప్రచారాన్ని అసెంబ్లీలో తిప్పికొడదామని కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ అంశంపై ప్రజలకు వాస్తవాలు చెబుదామన్నారు. 22-ఏ జాబితా కొత్తగా వచ్చింది కాదని, కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిందేనని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వివరించారు. అసెంబ్లీలో దీనిపై చర్చ నిర్వహించినప్పుడు.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన భూ దోపిడీనీ బయటపెట్టనున్నట్లు చెప్పారు. అసెంబ్లీ కమిటీ హాల్లో గురువారం జరిగిన సీఎల్పీ భేటీలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు.. శాసనసభలో చర్చించనున్న అంశాలపైన సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా (మిగతా 2వ పేజీలో..)

## ప్రియాంక గాంధీ ఫేక్ వీడియోలు.. వాటిలో పెట్టుబడులు పెట్టొద్దంటూ ఆఫీస్ హెచ్చరిక

- ఏఐ టెక్నాలజీతో ప్రియాంక గాంధీ ఫేక్ వీడియోల సృష్టి
- కొన్ని పథకాలలో పెట్టుబడులు పెట్టాలంటూ మోసపూరిత ప్రచారం
- ఇవి పూర్తిగా నకిలీవని స్పష్టం చేసిన ఆమె కార్యాలయం
- వీటిని నమ్మి డబ్బులు పెట్టవద్దని ప్రజలకు హెచ్చరిక
- అనుమానాస్పద పోస్టులను రిపోర్ట్ చేయాలని విజ్ఞప్తి

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా పేరుతో సామాజిక మాధ్యమాల్లో కొన్ని నకిలీ వీడియోలు విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. ఈ పరిణామంపై ఆమె కార్యాలయం తీవ్రంగా స్పందిస్తూ ప్రజలకు హెచ్చరిక జారీ చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించిన ఈ వీడియోలను చూసి మోసపోవద్దని స్పష్టం చేసింది. కొన్ని సంస్థలు, పథకాలలో పెట్టుబడులు పెట్టాలని ప్రియాంక గాంధీ స్వయంగా (మిగతా 2వ పేజీలో..)



## ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది: భట్టి విక్రమార్క

- రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్న భట్టి
- ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల కోసం శ్రీశైలం, సాగర్ తదితర రిజర్వాయర్లను పరిశీలిస్తున్నామని వెల్లడి
- విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు చేరిందన్న డిప్యూటీ సీఎం



తెలంగాణలో పునరుత్పాదక శక్తి (రెన్యువబుల్ ఎనర్జీ) రంగాన్ని మరింత బలోపేతం (మిగతా 2వ పేజీలో..)

## తమిళనాడులో రాష్ట్ర పార్టీగా టీవీకే.. విజయ్ పార్టీకి ఈసీ అధికారిక గుర్తింపు

- తమిళగ వెట్రి కళగంకు రాష్ట్ర పార్టీ హోదా కల్పించిన ఈసీ
- విజయ్ పార్టీకి శాశ్వత గుర్తుగా 'విజిల్' కేటాయింపు
- 2026 అసెంబ్లీ ఎన్నికల్లో 108 సీట్లు గెలిచిన టీవీకే
- తొలి ఎన్నికల్లోనే 34.92 శాతం ఓట్లు సాధించిన పార్టీ
- తమిళనాడులో ఏడో రాష్ట్ర పార్టీగా అవతరించిన టీవీకే



ప్రముఖ నటుడు విజయ్ (మిగతా 2వ పేజీలో..)

## రూ. 200 కోట్ల భూమిని రేవంత్ రెడ్డి ఆయన సోదరుడికి కట్టబెట్టాడు: కేటీఆర్

- రేవంత్ రెడ్డి తన 18 గంటల సమయాన్ని ఆయన సోదరుల కోసం కేటాయిస్తున్నారన్న కేటీఆర్
- లక్ష మూలధనం ఉన్న కంపెనీకి రూ. 200 కోట్ల భూమిని కట్టబెట్టారని ఆరోపణ
- ఈ భూ కుంభకోణంపై ఈడీ, సీబీఐలతో కేంద్రం విచారణ జరిపించాలని డిమాండ్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోదరుడు కొండల్ రెడ్డికి చెందిన షెల్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కట్టబెట్టారని, ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వరుసగా (మిగతా 2వ పేజీలో..)



హంస కలం వార్త

## ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది: భట్టి విక్రమార్క

(మొదటి పేజీ తరువాయి)

చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, అందులో భాగంగా రిజర్వాయర్లపై 'ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ల' ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. నీటిపారుదల, విద్యుత్ శాఖలు సంయుక్తంగా నాగార్జునసాగర్, శ్రీశైలం సహా రాష్ట్రంలోని పలు ప్రధాన రిజర్వాయర్లను దీనికోసం సమగ్రంగా పరిశీలిస్తున్నాయని చెప్పారు. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అధిక వ్యయం కావడం ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు/సుంకాల వల్ల ఒక్క మెగావాట్ ప్రాజెక్టుపై దాదాపు రూ. 1.30 కోట్ల మేర అదనపు భారం పడుతోందని, ఈ నిబంధనలను కేంద్రం సడలిస్తే రాష్ట్రానికి సోలార్ విభాగంలో పెట్టుబడులు భారీగా వెల్లువెత్తుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయం పెరగడంతో విద్యుత్ డిమాండ్ ఏకంగా 19,000 మెగావాట్లకు చేరిందని తెలిపారు. పేదలు, రైతుల విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం ఏటా రూ. 19,000 కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో ఉచిత సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేస్తున్నట్లు భట్టి ప్రకటించారు. అమ్రాబాద్ పరిధిలోని 80 గ్రామాలను పూర్తిస్థాయిలో సోలరైజ్ చేసేందుకు పైలట్ ప్రాజెక్ట్ చేపట్టామని, అక్కడ స్వతంత్ర 'మైక్రో గ్రిడ్లు' నిర్మించేందుకు కసరత్తు జరుగుతోందన్నారు. సాధారణ రైతులు, ప్రజలు తమ ఇళ్లు, పొలాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

## రూ. 200 కోట్ల భూమిని రేవంత్ రెడ్డి ఆయన సోదరుడికి కట్టబెట్టాడు: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆ వివాదాస్పద భూ కేటాయింపు స్థలాన్ని ఈరోజు ఆయన సందర్శించిన పర్యవేక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని నిత్యం చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, ఆ సమయాన్నంతా తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కాకుండా తన సొంత సోదరులు, బినామీ షెల్ కంపెనీల లబ్ధి కోసమే కేటాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేవలం రూ. లక్ష మూలధనంతో నడిచే కంపెనీకి ఐదెకరాల విలువైన భూమిని ఎలా కేటాయిస్తారని కేటీఆర్ నిలదీశారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎవరైనా కేవలం లక్ష రూపాయలతో స్టార్టప్ పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే వందల కోట్ల విలువైన భూములు ఇస్తుందా..? అని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇజ్రాయెల్ వ్యాపార భాగస్వామ్యాలపై ప్రధాని మోదీని ప్రశ్నిస్తుంటే, ఇక్కడ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రేవంత్ రెడ్డి సోదరుడి కోసం 'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్' సంస్థతో ఒప్పందాలు కుదుర్చుకుని ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ల పేరుతో భూములు కొల్లగొడుతోందని ఆరోపించారు. నెలకు రూ. 4,000 పింఛన్, మహిళలకు రూ. 2,500, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలకు మొండిచేయి చూపించిన కాంగ్రెస్, సీఎం సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి, వందల కోట్ల ఆస్తులు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. ఈ భారీ భూ కుంభకోణంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే తక్షణమే ప్రవర్తన, పత్రాలపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## తమిళనాడులో రాష్ట్ర పార్టీగా టీవీకే.. విజయ్ పార్టీకి ఈసీ అధికారిక గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీకి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) రాష్ట్ర పార్టీగా అధికారిక గుర్తింపునిచ్చింది. పార్టీకి శాశ్వత ఎన్నికల గుర్తుగా 'విజిల్'ను కేటాయిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే కనబరిచిన అద్భుత పనితీరు ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన టీవీకే, మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 108 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. రాష్ట్రవ్యాప్తంగా పోలైన ఓట్లలో 34.92 శాతం సాధించి తన సత్తా చాటింది. ఎన్నికల నిబంధనల ప్రకారం, ఒక పార్టీకి రాష్ట్ర పార్టీ హోదా దక్కాలంటే కనీసం 6 శాతం ఓట్లతో పాటు రెండు అసెంబ్లీ స్థానాలు గెలవాలి లేదా మొత్తం ఓట్లలో 8 శాతం సాధించాలి. టీవీకే ఈ నిబంధనలను సునాయాసంగా అధిగమించి ఈ గుర్తింపును సొంతం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీవీకేకు 'విజిల్'ను ఉమ్మడి గుర్తుగా ఈసీ కేటాయించగా, ఎన్నికల్లో సాధించిన ఘన విజయం నేపథ్యంలో ఇప్పుడు అదే గుర్తునే శాశ్వతంగా ఖరారు చేసింది. తాజా గుర్తింపుతో భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ టీవీకే ఇదే గుర్తుపై పోటీ చేసే అవకాశం లభించింది. తమిళనాడులో ఇప్పటికే గుర్తింపు పొందిన డీఎంకే, ఏఐఏడీఎంకే, సీపీఐ, వీసీకే, నామ్ తమిళర్ కట్చి, డీఎండీకే వంటి పార్టీల సరసన ఇప్పుడు టీవీకే కూడా చేరింది. ఫలితంగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీల సంఖ్య ఏడుకు చేరుకుంది. ఈ పరిణామం తమిళ రాజకీయాల్లో టీవీకేను ఒక ప్రధాన శక్తిగా ఆవిష్కరించింది.



# బీఆర్ఎస్ 'విషప్రచారం'పై ఎదురుదాడి!

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు వర్షాకాల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశాలు సజావుగా జరగకుండా కేసీఆర్.. ఇటీవల జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో కుట్ర చేశాడన్నారు. అధికారం పోయినా అహంకారం వీడని కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. పోలీసులను, ప్రజాప్రతినిధులను దూషిస్తూ మూడు రోజుల పాటు సభ జరగకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి వారికి ఇబ్బంది కలిగించారని, స్పీకర్‌ను అత్యంత అభ్యంతరకరంగా దూషించారని గుర్తు చేశారు. దీనికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నిరసన చేపడితే.. దళితులు నడిచిన నేలను బీఆర్ఎస్ నేతలు శుద్ధి చేసి, వారిని అవమానించారన్నారు. ఎస్ఐఆర్‌పై సీఎం మాట్లాడుతూ.. దేశంలో వయోజన జనాభా 103 కోట్లు ఉందని లెక్క తేల్చిన కేంద్ర ప్రభుత్వం.. ఓటరు జాబితాలో మాత్రం 88 కోట్ల మందినే చూపుతోందని పేర్కొన్నారు. అంటే, దేశంలో 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయని.. ఎక్కడో ఏదో ప్రమాదం పొంచి ఉందని సందేహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనూ ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు భారీగా తొలగించే కుట్ర జరుగుతోందని, ప్రతి ఒక్కరూ అర్హులైనవారి ఓటును కాపాడే అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. కొత్తగా ఎమ్మెల్యేగా గెలిచినవారు.. వన్ టైమ్ వండర్‌లుగా మిగిలిపోవద్దని, బాగా పని చేసి మరోమారు గెలిచి.. సీనియర్‌లు అనిపించుకోవాలన్నారు. ఎమ్మెల్యేల వ్యక్తిగత పనితీరు కూడా గెలుపోటములను ప్రభావితం చేస్తుందన్నారు. తెలంగాణ కులగణనను నమూనాగా తీసుకుని.. దేశవ్యాప్త జనగణనలో కులగణననూ చేపట్టాలంటూ కేంద్రంపై ఒత్తిడి తెద్దామన్నారు. కేటీఆర్‌కు పోలీసు సిబ్బందిలో తాను కనిపించినట్లున్నానని, అందుకే అంత ఆక్రోశంగా వారి మీద దాడి చేశాడని రేవంత్ చమత్కరించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎదిగిన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీకే నష్టం చేయాలని చూస్తున్నారని తెలిపారు. జరిగిన ఘటనలపైన విచారణకు ఆదేశించామని సీఎం పేర్కొన్నారు. ఈ మూడు రోజుల్లో జరిగిన ఘటనలపైన ప్రజాభిప్రాయం ఎలా ఉందన్నదానిపై ఫ్లాష్ సర్వే చేయించానని, అందరూ బీఆర్ఎస్ పార్టీనే తప్పు పడుతున్నారని వెల్లడించారు. ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ చేసిన కుట్రను బలంగా తిప్పికొట్టడమేగాక, ఆ కుట్ర గురించి ప్రజలకు స్పష్టంగా తెలియజేసినందుకు మంత్రులు, విప్‌లు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అభినందిస్తున్నానని రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగానే ఉందని, దీనిపైన సభలో చర్చ జరిపి ప్రజల్ని అప్రమత్తం చేద్దామని సీఎం పేర్కొన్నారు. అనేక చోట్ల ప్రాజెక్టుల నుంచి పంటలకు నీళ్లు ఇవ్వాలన్న విజ్ఞప్తులు వస్తున్నాయని, కానీ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రాజెక్టుల్లోని నీళ్లను తాగునీటి అవసరాలకు వినియోగించాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఉందన్నారు. విద్యుత్తుకూ డిమాండ్ పెరిగిందని, ప్రతిరోజూ 19,500 మిలియన్ యూనిట్ల వాడకం జరుగుతోందని వెల్లడించారు. కొందామన్నా కూడా కరెంటు దొరకటం లేదని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, పాలిటెక్నిక్ కాలేజీల అంశాలపైనా సభలో చర్చ నిర్వహిద్దామన్నారు.

కలిసి పని చేస్తే కుట్రలు ఛేదించగలం: భట్టి

బీఆర్ఎస్ నాయకుల ప్రవర్తన, వారి భాష, శుద్ధీకరణ కార్యక్రమంపై కాంగ్రెస్ నేతలంతా కలిసికట్టుగా, సమర్థవంతంగా స్పందించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. కలిసి పని చేస్తే కుట్రలను ఎలా ఛేదించగలమో చేసి చూపించామన్నారు. ఇకపైనా ఇదే పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ప్రభుత్వం ఇన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేయటం లేదని, తగినంత ప్రచారం చేసుకోకపోవడం వల్లే ప్రతిపక్షాలకు అవకాశం ఇచ్చినట్టవుతోందన్నారు. సమర్థవంతంగా ప్రచారం నిర్వహిస్తే ప్రతిపక్షాలు కొట్టుకుపోతాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సంక్షేమం, విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. సోషల్ మీడియానూ పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ఈ ప్రచార కార్యక్రమాన్ని పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ఎస్ఐఆర్‌పై దృష్టి పెట్టాలి: మహేశ్‌గౌడ్

దేశంలో సర్ ప్రక్రియ దుర్మార్గంగా అమలవుతోందని, తమవి కావనుకున్న ఓట్లను పెద్ద ఎత్తున తొలగిస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ తెలిపారు. రాష్ట్రంలోనూ పెద్దసంఖ్యలో ఓట్లు పోతున్నాయని, ముఖ్యంగా దళితులు, గిరిజనుల ఓట్లు ఎక్కువగా తొలగిస్తున్నారని చెప్పారు. దీనిని నివారించటంపై ఎమ్మెల్యేలు దృష్టి పెట్టాలన్నారు. కాగా, అసెంబ్లీ సమావేశాల్లో చర్చించనున్న అంశాలపై ఆయా శాఖల మంత్రులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అవగాహన కల్పించారు. ఎల్‌నినో ప్రభావంపై ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జనగణన ప్రశ్నావళిలో బీసీ కాలమ్‌పై పొన్నం ప్రభాకర్, 22-ఏ పైపొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పాలిటెక్నిక్ కాలేజీల అంశంపై వివేక్ వివరించారు. ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్‌గా నియమితులైన మధుయాష్కీగౌడ్‌ను సీఎల్పీ సమావేశం ముగిసిన అనంతరం సన్మానించారు.

## ప్రియాంక గాంధీ ఫేక్ వీడియోలు.. వాటిలో పెట్టుబడులు పెట్టొద్దంటూ ఆఫీస్ హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

ప్రోత్సహిస్తున్నట్లుగా ఈ నకిలీ వీడియోలను రూపొందించారు. ఇందుకోసం ఆమె ఛాయాచిత్రాలతో పాటు, ఏఐ ద్వారా ఆమె గొంతును (వాయిస్ క్లోనింగ్) అనుకరించారు. ఇవి అచ్చం ఆమె గొంతులాగే ఉండటంతో ప్రజలు నిజమని నమ్మే ప్రమాదం ఉందని ఆమె కార్యాలయం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వీడియోలు పూర్తిగా నకిలీవని, మోసపూరితమైనవని ప్రియాంక గాంధీ కార్యాలయం గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. వీటిని నమ్మి ఎవరూ నగదు పెట్టుబడులు పెట్టవద్దని విజ్ఞప్తి చేసింది. అలాగే, ఇటువంటి వీడియోలతో పాటు వచ్చే అనుమానాస్పద లింకులను అస్సలు క్లిక్ చేయవద్దని హెచ్చరించింది. సామాజిక మాధ్యమాల్లో ఇటువంటి పోస్టులు కనిపిస్తే వెంటనే వాటిని రిపోర్ట్ చేసి, ఆ ఖాతాలను బ్లాక్ చేయాలని ప్రజలకు సూచించింది. డీప్‌ఫేక్ సాంకేతికతను అడ్డుపెట్టుకుని ప్రముఖుల పేర్లతో సాగుతున్న ఆర్థిక మోసాల నుంచి ప్రజలను కాపాడేందుకే ఈ హెచ్చరిక జారీ చేసినట్లు వెల్లడించింది.

# ఏకంగా సెక్రటేరియట్‌లోనే లంచం.. ఏసీబీ చేతికి చిక్కిన ఉద్యోగి

### సచివాలయంలో రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఉద్యోగి

### సీఎంఆర్ఎఫ్ చెక్కు కోసం లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు

### బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి ఏసీబీ అధికారులు

### సచివాలయ దేవాలయం వద్ద డబ్బులు తీసుకుంటుండగా పట్టివేత

### లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు

తెలంగాణ సచివాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) సెక్షన్‌లో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. రూ. 2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు ఇచ్చేందుకు బాధితుడి నుంచి రూ. లక్ష లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీఎంఆర్ఎఫ్ చెక్కు కోసం లంచం అడగడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. గురువారం సచివాలయ ప్రాంగణంలో నిఘా ఏర్పాటు చేశారు. సచివాలయంలోని దేవాలయం వద్ద బాధితుడి నుంచి డబ్బులు తీసుకుంటుండగా డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ. లక్ష లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత సీఎంఆర్ఎఫ్ సెక్షన్‌లోనూ ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేయడం వెనుక మరికొందరి పాత్ర ఉందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో రెగ్యులర్ అధికారుల ప్రమేయం ఉందా? అన్నదీ ఏసీబీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



హంస కలం వార్త



# గణేష్ నిమజ్జనం సాఫీగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు



( సెప్టెంబర్-10 హంస కలంవార్త )

కూకట్ పల్లి పరిధిలోని ఐడీఎల్ సరస్సులో జరగనున్న గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, సాఫీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. నిమజ్జనం సందర్భంగా భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు గురువారం ఐడీఎల్ సరస్సు వద్ద జరగబోయే గణేష్ నిమజ్జన ఏర్పాట్లను ట్రాఫిక్ సంయుక్త చేశారు. పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు పరిశీలించారు. నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీజన, పోలీసు ఉన్నతాధికారులు, కూకట్ పల్లి ప్రాంతీయ కమిషనర్ వీరన్న, అదనపు పోలీసు కమిషనర్ నరేందర్, అదనపు పోలీసు కమిషనర్ నరేష్రెడ్డి, బాలానగర్ సహాయ పోలీసు కమిషనర్ ఆంజనేయులు, కూకట్ పల్లి ఉప కమిషనర్, ట్రాఫిక్ విభాగం అధికారులు, మున్సిపల్ అధికారులు, హైడ్రా అధికారులు తదితరులు ఈ పరిశీలనలో పాల్గొన్నారు. నిమజ్జనం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు, గణేష్ విగ్రహాలు తరలివచ్చే అవకాశం ఉన్నందున వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు. నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల మళ్లింపు, పార్కింగ్ తదితర అంశాలపై



అధికారులతో చర్చించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చోట ముందస్తు చర్యలు చేపట్టాలని, నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు సమన్వయంతో పనిచేయాలని అధికారులు ఉన్నతాధికారులు సూచించారు. అలాగే ఐడీఎల్ సరస్సు వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ను కోరారు. గణేష్ నిమ్మజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు, మున్సిపల్, హైడ్రా విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని కూకట్ పల్లి ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు పోలీసుల సూచనలను పాటిస్తూ సహకరించాలని విజ్ఞప్తి

# 28 కమ్యూనిటీ హాళ్లకు రూ.8.50 కోట్ల నిధులు







### కంటోన్మెంట్ అభివృద్ధికి మరో ముందడుగు

( సెప్టెంబర్-10 హంస కలంవార్త )

కంటోన్మెంట్లో 28 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించినందుకు వార్డు-4, వార్డు-5 ప్రజలు ఎమ్మెల్యే శ్రీగణేష్ ని కలిసి ధన్యవాదాలు తెలిపారు. ప్రజల తరఫున ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , ఇంఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ , అధికారులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలే ప్రాధాన్యతగా కంటోన్మెంట్ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. నవ కంటోన్మెంట్ నిర్మాణమే లక్ష్యంగా పని చేయడానికి ఈ నిధులు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే శ్రీగణేష్ ఈ సందర్భంగా అన్నారు

## మట్టి వినాయకులనే పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

(సెప్టెంబర్-10- హంస కలంవార్త )



హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6,500 మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ హైదరాబాద్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప ర్యావరణ పరిరక్షణ లో భాగంగా హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6,500 మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని వివేకానందనగర్లో గౌరవ పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ తన నివాసంలో ప్రారంభించి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. చెరువులు కలుషితం కాకుండా చూడడంతో పాటు వాటిని సంరక్షించుకోవాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 12 సంవత్సరాలుగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని గాంధీ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది 6,500 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను ప్రతి ఒక్కరూ వినియోగించి, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యుడు బసిరెడ్డి మధుసూధన్ రెడ్డి, సింగదాసరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్పల్లిలో 256 గ్రాముల గంజాయి పట్టివేత

( సెప్టెంబర్-10- హంస కలంవార్త )



కూకట్పల్లి: కూకట్పల్లి ప్రాంతంలో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆర్. ప్రసాద్ (33) అనే వ్యక్తి వద్ద గంజాయి ఉన్నట్లు గుర్తించిన అధికారులు తనిఖీలు నిర్వహించి సుమారు 256 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి వద్ద ఉన్న గంజాయితో పాటు అతను వినియోగిస్తున్న బైక్ను కూడా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్వాధీనం చేసుకున్న గంజాయి, బైక్ను కూకట్పల్లి ఎక్సైజ్ స్టేషన్ ఎస్హెచ్ఓకు అప్పగించిన

## వినాయక చవితి ఉత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గార్లకు ఆహ్వానం


( సెప్టెంబర్-10 హంస కలంవార్త )



సికింద్రాబాద్ గణేష్ టెంపుల్లో ఈనెల 14 వ తేదీ నుంచి నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాలకు హాజరు కావాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని, హైదరాబాద్ ఇంఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ని గురువారం నాడు శాసనసభ లోని ముఖ్యమంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి, మంత్రికి వేదాశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, సంజయ్, దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ దొంగ అరెస్ట్

( సెప్టెంబర్-10 హంస కలంవార్త )



జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాసనగర్లో స్థానికంగా నివసించే ముక్కిడి బాలకృష్ణ అనే వ్యక్తి తరచుగా బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించబడింది. ఇటీవల నమోదైన 3 బైక్ చోరీ కేసులకు సంబంధించి నిందితుడు ముక్కిడి బాలకృష్ణను అరెస్ట్ చేసి, రిమాండ్కు తరలించడం జరిగింది. నిందితుడి వద్ద నుండి ఒక పల్సర్, ఒక స్ప్లెండర్ మరియు ఒక యాక్టివా మొత్తం 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ కేసులను ఛేదించిన జగద్గిరిగుట్ట క్రైమ్ టీమ్ను డీసీపీ కుత్బుల్లాపూర్ మరియు ఏసీపీ కుత్బుల్లాపూర్ అభినందించారు..

హంస కలం వార్త

## జయశంకర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీకి పట్వారీ శశిధర్ అభినందనలు

( సెప్టెంబర్-10 హంస కలంవార్త )



ఆల్విన్ కాలనీ 124 డివిజన్ "జయ శంకర్ కాలనీ ఫేస్2" లోని "జయశంకర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్" నూతన కమిటీ ఏర్పాటు అనంతరం కమిటీ సభ్యులు మరియు కాలనీవాసులు అందరూ కలిసి "ఉమ్మడి ఆల్విన్ కాలనీ 124 డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్ ని కాలనీలో మర్యాదపూర్వకంగా కలవటం జరిగింది..ఈ సందర్భంగా పట్వారీ శశిధర్ జయశంకర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులను మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కారించి హృదయపూర్వకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కమిటీ సభ్యులంతా ఐకమత్యంగా ఉండాలని,ఎలాంటి అభిప్రాయ భేదాలకు లేకుండా కలిసి పనిచేయాలని కాలనీలో ఎటువంటి సమస్యలు కలుగకుండా చూసుకోవాలని కోరారు.నూతన కమిటీకి తన సంపూర్ణ సహకారం, మద్దతు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో నాయకులు, "నూతన కమిటీ సభ్యులు" కాలనీ 'ప్రెసిడెంట్' కోమిరెడ్డి రాంరెడ్డి , 'జనరల్ సెక్రటరీ' కొండా రమేష్, 'వైస్ ప్రెసిడెంట్' ఆంబోతు దేవా నాయక్ మరియు మహమ్మద్ గఫూర్, 'క్యాషియర్' ఈశ్వర్, 'జనరల్ సెక్రటరీ' జక్కుల సురేష్, వి. శివశంకర్, కే.నరేష్ మరియు కాలనీవాసులు, మహిళలు, యువత, టీం పట్వారీ తదితరులు పాల్గొన్నారు...

## జిల్లా న్యాయాధికార సంస్థ, మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా, కుషాయిగూడ



(సెప్టెంబర్-10 హంస కలంవార్త )




జిల్లా న్యాయ సేవాధికార్ సంస్థ, మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా కుషాయిగూడలో ప్రధాన న్యాయ మూర్తి వి. బాల భాస్కర్ రావ్ ఆదేశానుసారం కార్యదర్శి/సీనియర్ సివిల్ జడ్జి జి.ఎస్.ఎల్ ప్రియాంక పారా లీగల్ వాలంటీర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో న్యాయ సేవాధికర సంస్థ చట్టం ముఖ్య ఉద్దేశం , లక్ష్యాల గురించి పారా లీగల్ వాలంటీర్లకు వివరించారు. ఈ సమావేశం లో.. పారా లీగల్ వాలంటీర్ల హక్కులు, బాధ్యతల గురించి అవగాహన కల్పించారు. ఈ సేవాధికర సంస్థ యొక్క నెలవారి కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ సమావేశానికి 15 మంది పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన వెంకటేష్ గౌడ్

( సెప్టెంబర్-10 హంస కలంవార్త )



తెలంగాణ సాయుధ పోరాటంతో తనదైన శైలిలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ వారి కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి



నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి తెలంగాణ సాయుధ పోరాట కాలంలో చాకలి ఐలమ్మ ప్రదర్శించిన ధైర్య సాహసాలు, చైతన్యం నేటి తరానికీ ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆ కాలంలోనే హక్కుల సాధన కోసం న్యాయస్థానాల్లో చట్టపరమైన పోరాటం చేసిన ప్రజాస్వామిక వాది ఐలమ్మ అని గుర్తుచేశారు. నాడు ఐలమ్మ ప్రదర్శించిన స్ఫూర్తి, తెలంగాణ సాధనలోనూ, అనంతర ప్రగతి ప్రస్థానంలోనూ ఇమిడి ఉందని తెలియచేసారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, గోపాల్, పోశెట్టిగౌడ్, మల్లేష్, ఖలీమ్, నరసింహ, సుధ, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# కొండాపూర్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత




( సెప్టెంబర్-10- హంస కలంవార్త )

కాలనీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి: పి ఎస్ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ కొండాపూర్: కొండాపూర్ డివిజన్ పరిధిలోని గోల్డెన్ తులిప్ కాలనీ పార్క్‌లో నిర్వహించిన 'వన్ డే.. వన్ వార్డ్' కార్యక్రమంలో భాగంగా కాలనీలలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఐఏఎస్ అధికారి జి. సృజన, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మలెంపాటి, డీసీ సేవా ఇస్లావత్, తాజా మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్, వివిధ విభాగాల అధికారులు, కాలనీల రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ 'వన్



డే.. వన్ వార్డ్' కార్యక్రమంలో భాగంగా కాలనీల రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో అధికారులు ముఖాముఖి సమావేశం నిర్వహించడం ద్వారా స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకున్నామని తెలిపారు. కాలనీల వాసులు రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, మంచినీరు తదితర సమస్యలను కమిషనర్, అధికారుల దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. ప్రజా సమస్యలను ప్రథమ ప్రాధాన్యతగా తీసుకుని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరినట్లు గాంధీ తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని సూచించారు.


రోడ్లు, డ్రైనేజీ, పార్కులపై ప్రత్యేక దృష్టి

కొండాపూర్ వార్డు పరిధిలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తామని గాంధీ తెలిపారు. రోడ్ల అభివృద్ధి, డ్రైనేజీ సమస్యల పరిష్కారం, వీధి దీపాల ఏర్పాటు, మంచినీటి సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు.కాలనీలలోని పార్కులను అన్ని హంగులతో అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దుతామని, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పిల్లలు, వృద్ధులు సేదతీరేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించి, కాలనీలలో ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పుతామని పేర్కొన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేయాలికొండాపూర్ వార్డు పరిధిలోని పలు సమస్యలు, అభివృద్ధి పనులపై



కమిషనర్ జి. సృజనతో చర్చించినట్లు గాంధీ తెలిపారు. పెండింగ్, అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు.సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అధికారులను కోరారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని అసంపూర్తిగా ఉన్న నాలాల విస్తరణ పనులను పూర్తి చేసి, వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంకుడు గుంతల ఏర్పాటుతో నీటి సంరక్షణ ప్రతి కాలనీలో ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని గాంధీ పిలుపునిచ్చారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఇంకుడు గుంతలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి కాలనీ ఇంకుడు గుంతల ఏర్పాటులో ఆదర్శంగా నిలవాలని కోరారు. అదేవిధంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి చెత్తను, పొడి చెత్తను వేర్వేరుగా చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. కాలనీలలో పేరుకుపోయిన చెత్తాచెదారం, మట్టి కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించి ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం అందించాలని అధికారులను కోరారు. కొండాపూర్ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎంసి ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, జలమండలి తదితర విభాగాల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీల రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శాసనమండలిలో వినూత్నంగా నిరసన తెలిపిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ..




**శాసనమండలిలో తమ నిరసనను కెమెరాల్లో చూపించడం లేదని భావించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు వినూత్నంగా నిరసన తెలిపారు.**

**ఎమ్మెల్సీ చింతపండు నవీన్ మాట్లాడుతున్న సమయంలో ఆయన పక్కనే కూర్చున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు , తన జేబులో సిద్ధంగా ఉంచుకున్న పేపర్‌ను బయటకు తీసి ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు.**

( సెప్టెంబర్-10 హంస కలంవార్త )

ఆ పేపర్‌పై "బామ్మర్దికి అమృత్ టెండర్లు.. తమ్ముడికి రావిర్యాల భూములు.. రైజింగ్ అనుముల ఫ్యామిలీ" అంటూ ప్రభుత్వ తీరుపై ప్రశ్నలు లేవనెత్తుతూ నినాదాలను ప్రదర్శించారు.తమ నిరసనను ప్రజలకు, మీడియాకు చేరకుండా కెమెరాల్లో చూపించడం లేదని పేర్కొంటూ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఈ విధంగా వినూత్నంగా నిరసన తెలిపారు. అయితే ఆయన పేపర్‌ను ప్రదర్శించగానే శాసనమండలి కెమెరా దిశను మార్చడం చర్చనీయాంశంగా మారింది. ప్రజా సమస్యలు, ప్రభుత్వ నిర్ణయాలు, అవినీతి ఆరోపణలపై తమ గొంతును శాసనమండలిలో వినిపిస్తూనే ఉంటామని, తమ నిరసనలను అడ్డుకునే ప్రయత్నాలు చేసినా ప్రజల తరఫున ప్రశ్నించడం ఆపేది లేదని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు స్పష్టం చేశారు.



# మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి



**డా. కె. ఆనంద్ హస్మత్‌పేట్‌లోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యం, పోషణ, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు.**

**( సెప్టెంబర్-10 హంస కలంవార్త )**

ఈ సందర్భంగా పాఠశాలలోని ఆహార నిల్వల స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. అనంతరం వంటశాలను సందర్శించి వంట సమయంలో ఆహారం నాణ్యత, పరిశుభ్రత, వంటగది



నిర్వహణను స్వయంగా పరిశీలించారు. పాఠశాల పరిసరాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించిన డా. కె. ఆనంద్, మరుగుదొడ్లు సరైన స్థితిలో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్లను నిరంతరం శుభ్రంగా, పరిశుభ్రంగా ఉంచాలని, అపరిశుభ్రత కారణంగా విద్యార్థుల్లో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. ఆర్‌బీఎస్‌కే బృందాలు పాఠశాలలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి, విద్యార్థుల ఆరోగ్య వివరాలను పరిశీలించారు. అలాగే ఎస్‌ఏఎం--ఎమ్‌ఏఎమ్ పిల్లలను గుర్తించడం, వారి వివరాల నమోదు, ఆరోగ్య పరిస్థితిపై తీసుకుంటున్న చర్యల గురించి ఆరా తీశారు. విద్యార్థుల



ఆరోగ్యం, పోషణ, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పాఠశాల పరిసరాల పారిశుద్ధ్యంపై విద్యార్థులకు తరగతి గదిలోనే అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, పాఠశాలలో పరిశుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిరంతరం కొనసాగించాలని డా. కె. ఆనంద్ సంబంధిత పాఠశాల సిబ్బందికి సూచించారు.

# తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ




**క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ 40వ వార్షిక కన్వెన్షన్ లో టీజీఎస్ ఆర్టీసీ కి అవార్డుల పంట.**

**విశేష ప్రతిభ కనబరిచిన సిబ్బందికి టీజీఎస్ ఆర్టీసీ వీసీ డ ఎండీ వై.నాగిరెడ్డి అభినందన.**

**ఢిల్లీలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక**

**( సెప్టెంబర్-10 హంస కలంవార్త )**

సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ నిర్వహించిన 40వ వార్షిక కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్స్ -2026) సెప్టెంబర్ 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లోని హోటల్ మేరీగోల్డ్‌లో ఘనంగా ముగిసింది. ఈ రెండు రోజుల సదస్సులో వివిధ సంస్థల నుండి 200 కంటే ఎక్కువ బృందాలు పాల్గొని నాణ్యతా ప్రమాణాల పెంపు, పని ప్రదేశంలో వినూత్న మార్పులు, ఉత్పాదకత పెరుగుదల , అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను ప్రదర్శించాయి. ఈ కన్వెన్షన్‌లో టీజీఎస్ ఆర్టీసీ ఉప్పల్ జోనల్ వర్క్‌షాప్ నుండి పాల్గొన్న 4 బృందాలు విశేష ప్రతిభ కనబరిచాయి.




నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా వ్యయ నియంత్రణ (కాస్ట్ కంట్రోల్) పై టీజీఎస్ ఆర్టీసీ అవలంబిస్తున్న ఉత్తమ విధానాలను ప్రదర్శించి, 4 బృందాలు ప్రతిష్టాత్మక గోల్డ్ అవార్డులను గెలుచుకున్నాయి. త్వరలోనే ఢిల్లీలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో ఈ బృందాలు టీజీఎస్ ఆర్టీసీ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాయి. ఈ ముగింపు సమావేశానికి తెలంగాణ ప్రభుత్వ ఆర్‌టీఐ కమీషనర్ బి. అయోధ్య రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు అభినందనలు తెలిపారు. సామూహిక ఆలోచనలు, జట్టుకృషి మరియు ఉద్యోగుల భాగస్వామ్యంతో అసాధారణ ఫలితాలు సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. నాణ్యతను కేవలం ఒక లక్ష్యంగా




కాకుండా రోజువారీ అలవాటుగా మార్చుకోవాలని, ఉత్తమ విధానాలను పంచుకోవడానికి వివిధ పరిశ్రమల మధ్య సహకారం పెరగాలని మరియు సంస్థాగత లక్ష్యాలను 'ఆత్మనిర్భర్ వికసిత్ భారత్' ఆశయాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు. అవార్డులు సాధించిన సిబ్బందిని టీజీఎస్ ఆర్టీసీ వీసీ డ ఎండీ వై.నాగిరెడ్డి అభినందించారు. నాణ్యత ప్రమాణాలను పెంపొందించి తెలంగాణలో మెరుగైన ప్రజా రవాణాను ప్రజలకు చేరువ చేస్తామని ఎండీ నాగిరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్ ఆర్టీసీ ఈడీ సిహెచ్.వెంకన్న, సిఎమ్ఈ జానీరెడ్డి, డబ్ల్యూఎం జి.ఎన్ పవిత్ర, , హైదరాబాద్ ఛైర్మన్ దయానంద్ రెడ్డి, బాలకృష్ణ రావు, డైరెక్టర్ కె.మనోహర్ హెగ్డే తదితరులు పాల్గొన్నారు.




## తన సొంత ఖర్చుతో వార్డు కార్యాలయంలో ఫ్యాన్లను ఏర్పాటు చేయించిన మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్...





**( సెప్టెంబర్-10 హంస కలంవార్త )**

మూసాపేట్ వార్డు కార్యాలయంలో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ (SIR) ప్రక్రియను మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ పరిశీలన కోసం వెళ్లిన తరుణంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారుల (BLO) దుస్థితిని చూసి ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయంలో ఫ్యాన్లు పనిచేయకపోవడం, ఉదయం నుండి సాయంత్రం వరకు విధులు నిర్వర్తించే లు కూర్చొని పని చేయడానికి సరిపడా కుర్చీలు, టేబుళ్లు మరియు కనీసం త్రాగునీరు కూడా అందుబాటులో లేకపోవడాన్ని ఆయన స్వయంగా గుర్తించి చలించిపోయారు. అధికారులు పడుతున్న ఇబ్బందులపై తక్షణమే స్పందించిన తూము శ్రావణ్ కుమార్ ల కొరకు కుర్చీలు, టేబుళ్లను తక్షణమే ఏర్పాటు చేయించారు. మంచి నీటి సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేయించారు. అంతేకాకుండా, వెంటనే తన సొంత ఖర్చుతో కొత్త ఫ్యాన్లు కొనుగోలు చేసి వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తుకారాం, ఒగ్గు లింగం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్టేట్ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ జిట్టా రమ్యకృష్ణ సునీల్ యాదవ్ సంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ఇన్చార్జిగా నియమితులైన సందర్భంగా



**( సెప్టెంబర్-10 హంస కలంవార్త )**

కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ హేమ దుర్గ భవన్ లో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ ని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేయడం జరిగింది. అనంతరం జిట్ట రమ్యకృష్ణ ని బండి రమేష్ శాల్వాతో సన్మానించారు బండి రమేష్ మాట్లాడుతూ కూకట్ పల్లి నియోజకవర్గం చెందిన రమ్యకృష్ణ కి సంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ఇన్చార్జిగా నియమితులైనందుకు చాలా సంతోషకరంగా ఉందని తెలియజేశారు యూత్ కాంగ్రెస్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తున్నందుకు రమ్యకృష్ణ ని అభినందించారు,ఈ యొక్క కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం సీనియర్ నాయకులు జిట్టా సునీల్ కుమార్ యాదవ్ బోయిన్పల్లి మార్కెట్ కమిటీ మెంబర్ అస్లాం ,మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుశీల్ యాదవ్ , కూకట్ పల్లి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ నాయకులు బుజ్జి,యశ్వంత్, భాను, సంతు,యోగి పాల్గొన్నారు

# బంగ్లాదేశ్ తో సెమీస్.. ఓ మోస్తరు స్కోరుకే పరిమితమైన టీమిండియా అమ్మాయిలు

**మహిళల ఆసియా కప్ సెమీ ఫైనల్‌లో టాస్ గెలిచిన బంగ్లాదేశ్**

**తొలుత బ్యాటింగ్ చేసిన భారత్**

**విధ్వంసకర ఇన్నింగ్స్‌తో అదరగొట్టిన ఓపెనర్ షఫాలీ వర్మ**

**20 ఓవర్లలో 6 వికెట్లకు 149 పరుగులు చేసిన టీమిండియా**

**బంగ్లాదేశ్ బౌలర్లలో సుల్తానా ఖాతూన్‌కు రెండు వికెట్లు**

**ఫైనల్ బెర్త్ కోసం బంగ్లాదేశ్ ముందు 150 పరుగుల లక్ష్యం**



మహిళల ఆసియా కప్ 2026 టోర్నీలో ఫైనల్ బెర్త్ లక్ష్యంగా జరుగుతున్న తొలి సెమీ ఫైనల్‌లో భారత మహిళల జట్టు పోరాడే స్కోరు సాధించింది. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న ఈ కీలక మ్యాచ్‌లో ఓపెనర్ షఫాలీ వర్మ (64) మెరుపు హాఫ్ సెంచరీతో చెలరేగడంతో, టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. దీంతో ఫైనల్ చేరాలంటే బంగ్లాదేశ్ ముందు 150 పరుగుల లక్ష్యం నిలిచింది. దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన బంగ్లాదేశ్ కెప్టెన్ ఫీల్డింగ్ ఎంచుకుంది. బంగ్లా బౌలర్లు తమ కెప్టెన్ నిర్ణయం సరైనదేనని నిరూపిస్తూ ఆరంభంలోనే భారత్‌కు షాకిచ్చారు. ఫామ్‌లో ఉన్న స్టార్ ఓపెనర్ స్మృతి మంధన (2) రెండో ఓవర్‌లోనే సుల్తానా ఖాతూన్ బౌలింగ్‌లో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. దీంతో భారత్ 9 పరుగులకే తొలి వికెట్ కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన ప్రతిక రావల్‌తో కలిసి షఫాలీ వర్మ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. ఆరంభంలో నెమ్మదిగా ఆడినా, కుదురుకున్న తర్వాత షఫాలీ తనదైన శైలిలో బౌండరీలతో విరుచుకుపడింది. ముఖ్యంగా బంగ్లా బౌలర్లను లక్ష్యంగా చేసుకుని భారీ షాట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ఈ క్రమంలో కేవలం 40 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 64 పరుగులు చేసి కీలక ఇన్నింగ్స్ ఆడింది. రెండో వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన తర్వాత ప్రతిక రావల్ (20) ఔటవ్వగా, కాసేపటికే షఫాలీ కూడా పెవిలియన్ చేరింది. షఫాలీ ఔటైన తర్వాత స్కోరు వేగం కాస్త మందగించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (24 నాటౌట్) ఒక ఎండ్‌లో నిలకడగా ఆడినా, పరుగులు వేగంగా రాలేదు. అయితే, చివరి ఓవర్లలో వికెట్ కీపర్ రిచా ఘోష్ (16 బంతుల్లో 21), ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (6 బంతుల్లో 13) వేగంగా ఆడే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా వీరిద్దరూ భారీ షాట్లతో జట్టు స్కోరును 150 పరుగులకు చేరువ చేశారు. చివర్లో వరుసగా వికెట్లు పడినా, భారత్ గౌరవప్రదమైన స్కోరు సాధించగలిగింది. బంగ్లాదేశ్ బౌలర్లలో సుల్తానా ఖాతూన్ రెండు కీలక వికెట్లు పడగొట్టగా, రబేయా ఖాన్, నహిదా అక్తర్, మరుఫా అక్తర్ తలో వికెట్ తీశారు. ఫైనల్ చేరేందుకు 150 పరుగుల లక్ష్యంతో బంగ్లాదేశ్ మరికాసేపట్లో బ్యాటింగ్ ప్రారంభించనుంది.

# మహిళల ఆసియా కప్ సెమీస్: టాస్ గెలిచిన బంగ్లాదేశ్.. భారత్‌కు బ్యాటింగ్!

**మహిళల ఆసియా కప్ సెమీ ఫైనల్లో టాస్ గెలిచిన బంగ్లాదేశ్**

**భారత్‌తో మ్యాచ్‌లో తొలుత బౌలింగ్ ఎంచుకున్న బంగ్లా**

**దుబాయ్ వేదికగా జరుగుతున్న కీలక నాకౌట్ పోరు**

**గెలిచిన జట్టు ఆదివారం జరిగే ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది**

**గత మ్యాచ్ ఆడిన జట్లతోనే బరిలోకి దిగుతున్న ఇరు జట్లు**

మహిళల ఆసియా కప్ 2026 టోర్నమెంట్‌లో ఫైనల్ బెర్త్ లక్ష్యంగా జరుగుతున్న తొలి సెమీ ఫైనల్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. దుబాయ్ అంతర్జాతీయ స్టేడియం వేదికగా గురువారం జరుగుతున్న ఈ కీలక పోరులో, భారత జట్టు తొలుత బ్యాటింగ్ చేయనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఆదివారం జరిగే టైటిల్ పోరుకు అర్హత సాధిస్తుంది. ఈ హై-వోల్టేజ్ నాకౌట్ మ్యాచ్ కోసం ఇరు జట్లు తమ గత కూర్పులలో ఎలాంటి మార్పులు చేయకుండానే బరిలోకి దిగాయి. గ్రూప్-ఏలో అద్భుత ప్రదర్శన చేసిన ఏడుసార్లు ఛాంపియన్ భారత్, ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా సెమీస్‌కు చేరింది. థాయ్‌లాండ్, హాంగ్ కాంగ్-చైనా, పాకిస్థాన్‌లపై వరుస విజయాలతో అజేయంగా నిలిచింది. టాస్ ఓడిపోవడంపై భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ స్పందిస్తూ, "నిజం చెప్పాలంటే, మేము ముందుగా బ్యాటింగ్ చేయాలనే అనుకున్నాం. బోర్డుపై పరుగులు ఉంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మాకు బ్యాటింగ్ రావడం మంచిదే అయింది. టీ20 ఫార్మాట్‌లో ఏ జట్టునూ తక్కువ అంచనా వేయలేం. ఈ పిచ్ చాలా సంక్లిష్టంగా ఉంది. పవర్‌ప్లే ముగిశాక పరిస్థితులను బట్టి ఎంత స్కోర్ చేయాలో నిర్ణయించుకుంటాం" అని తెలిపింది. మరోవైపు, 2018లో ఛాంపియన్‌గా నిలిచిన బంగ్లాదేశ్, గ్రూప్-బీలో రెండో స్థానంలో నిలిచి సెమీస్‌కు చేరుకుంది. మంగళవారం నాడు యూఏఈతో జరిగిన తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో విజయం సాధించి నాకౌట్‌కు అర్హత పొందింది. టాస్ గెలిచిన అనంతరం బంగ్లాదేశ్ కెప్టెన్ నిగర్ సుల్తానా మాట్లాడుతూ, "ఇక్కడి పరిస్థితులను చూసి మేము బౌలింగ్ ఎంచుకున్నాం. మా బౌలర్లకు వికెట్ నుంచి సహకారం లభిస్తుందని భావిస్తున్నాం. 2018 నాటి విజయాలు మాకు గుర్తున్నాయి, కానీ ఇది మాకు చాలా ముఖ్యమైన రోజు. ఈ మ్యాచ్‌లో బాగా ఆడితే ఫైనల్ ఆడే మరో అవకాశం దొరుకుతుంది" అని పేర్కొంది.

భారత్: షఫాలీ వర్మ, స్మృతి మంధాన, ప్రతికా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), దీప్తి శర్మ, భారతి ఫుల్మాలి, రిచా ఘోష్ (వికెట్ కీపర్), ప్రేమ రావత్, ఎన్. శ్రీ చరణి, క్రాంతి గౌడ్, నందిని శర్మ.

బంగ్లాదేశ్: దిలారా అక్తర్, జురియా ఫెర్దస్, శోభన మోస్త్రీ, నిగర్ సుల్తానా (కెప్టెన్ ఑ వికెట్ కీపర్), షర్మిన్ అక్తర్, షోర్నా అక్తర్, ఫహీమా ఖాతూన్, నహిదా అక్తర్, రబేయా ఖాన్, సుల్తానా ఖాతూన్, మరుఫా అక్తర్.




# మహిళల ఆసియా కప్ ఫైనల్లోకి దూసుకెళ్లిన భారత్.. బంగ్లాదేశ్ ఫినిష్




**మహిళల ఆసియా కప్ ఫైనల్‌కు చేరిన భారత జట్టు**

**సెమీ ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై 40 పరుగుల తేడాతో విజయం**

**అద్భుత హాఫ్ సెంచరీతో చెలరేగిన షఫాలీ వర్మ**

**బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి కీలక పాత్ర పోషించిన దీప్తి శర్మ**

మహిళల ఆసియా కప్ 2026లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. దుబాయ్ వేదికగా జరిగిన సెమీ ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై 40 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్ షఫాలీ వర్మ (64) అద్భుత హాఫ్ సెంచరీతో చెలరేగగా, ఆల్‌రౌండర్ దీప్తి శర్మ బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. 150 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్‌ను భారత బౌలర్లు సమర్థంగా కట్టడి చేశారు. ఆది నుంచి క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ఒత్తిడి పెంచారు. భారత బౌలర్ల ధాటికి బంగ్లా బ్యాటర్లు ఎవరూ క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. షోర్నా అక్తర్ (22లి) టాప్ స్కోరర్‌గా నిలిచింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3 వికెట్లతో బంగ్లా పతనాన్ని శాసించగా, నందని శర్మ రెండు వికెట్లు పడగొట్టింది. దీంతో బంగ్లాదేశ్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 109 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ విజయంతో టీమిండియా ఆసియా కప్ ఫైనల్‌లో అడుగుపెట్టింది. అంతకుముందు, ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన బంగ్లాదేశ్ ఫీల్డింగ్ ఎంచుకోవడంతో భారత్ తొలుత బ్యాటింగ్ చేసింది. ఆరంభంలోనే స్మృతి మంధాన (2) వికెట్‌ను కోల్పోయినా, షఫాలీ వర్మ తనదైన శైలిలో బంగ్లా బౌలర్లపై ఎదురుదాడికి దిగింది. కేవలం 40 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 64 పరుగులు చేసి భారీ స్కోరుకు బాటలు వేసింది. ఆమెకు జతగా ప్రతిక రావల్ (20) రాణించింది. చివర్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (24లి), రిచా ఘోష్ (21), దీప్తి శర్మ (13) వేగంగా పరుగులు చేయడంతో భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 149 పరుగుల మంచి స్కోరును నమోదు చేసింది. రేపు (సెప్టెంబరు 11) జరిగే రెండో సెమీఫైనల్లో పాకిస్థాన్, శ్రీలంక తలపడనున్నాయి. ఈ మ్యాచ్ విజేతతో ఆదివారం జరిగే ఫైనల్లో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది.

# బ్యాట్ నాకు క్రీడా పరికరం మాత్రమే కాదు: సచిన్ ఎమోషనల్ పోస్ట్

**తన క్రికెట్ బ్యాట్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సచిన్**

**సరైన ఫీల్ కోసం బ్యాట్‌ను తానే స్వయంగా సరిచేసుకునేవాడినని వెల్లడి**

**వడ్రంగి పనిముట్లతో బ్యాట్‌కు మెరుగులు దిద్దినట్లు తెలిపిన సచిన్**

క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ తన క్రీడా జీవితంలోని మధుర జ్ఞాపకాలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడు. తన విజయాల్లో కీలక పాత్ర పోషించిన క్రికెట్ బ్యాట్‌తో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. బ్యాట్ అనేది తనకు కేవలం ఒక క్రీడా పరికరం మాత్రమే కాదని పేర్కొన్నాడు. "నా దృష్టిలో బ్యాట్ అనేది కేవలం ఒక పరికరం కాదు. దానిని చేతుల్లోకి తీసుకున్నప్పుడు ఎలాంటి అనుభూతి కలుగుతుందో నాకు స్పష్టంగా తెలుసు. అందుకే అతి చిన్న అంశాలపై కూడా నేను ప్రత్యేక శ్రద్ధ వహించేవాడిని" అని సచిన్ తన పోస్టులో పేర్కొన్నాడు. అవసరమైనప్పుడు తన వద్ద ఉన్న కార్పెంటరీ కిట్‌ను బయటకు తీసి, బ్యాట్‌కు స్వయంగా మెరుగులు దిద్దుకునేవాడినని గుర్తుచేసుకున్నాడు. తనకు నచ్చిన ఆకృతి, సరైన పట్టు లభించే వరకు దానిపై స్వయంగా పని చేసేవాడినని వివరించాడు. ఈ క్రమంలో గడిపిన చిన్న చిన్న క్షణాలు తనకు ఎంతో మధురంగా గుర్తున్నాయని సచిన్ తెలిపాడు. "నిజానికి ఆ జ్ఞాపకాలు కేవలం బ్యాట్‌కు సంబంధించినవి మాత్రమే కాదు, ఆ ప్రక్రియ ద్వారా ఆ బ్యాట్‌ను నా సొంతం చేసుకోవడానికి సంబంధించినవి" అంటూ తన పోస్టును ముగించాడు.



హంస కలం వార్త

# ‘ఎపిక్’ దాదాపు నా జీవిత కథే.. కానీ ఆ ఒక్కటీ జరగలేదు: ఆనంద్ దేవరకొండ

**ఒక్కటి తప్ప ‘ఎపిక్’ సినిమా కథ నా జీవితంలో జరిగిందన్న ఆనంద్ దేవరకొండ**

**అన్న విజయ్, వదిన రష్మిక తనకు అండగా ఉంటారని వెల్లడి**


**‘తక్షకుడు’ అనే మిస్టికల్ థ్రిల్లర్‌లో అంధుడిగా నటించనున్నట్టు ప్రకటన**



యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం ‘ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్’. ఆదిత్య హాసన్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆనంద్ దేవరకొండ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సినిమా దాదాపు తన జీవిత కథేనని, కేవలం ఒక్క విషయం మినహా మిగతావన్నీ తన నిజ జీవితంలో జరిగిన సంఘటనలేనని ఆయన వెల్లడించారు. “నేను ఒక బాధ్యత గల నటుడిని. నేను ఎంచుకునే కథలు కూడా అదే రీతిలో ఉంటాయి. ఈ సినిమా వాస్తవ జీవితానికి అద్దం పడుతుంది. ప్రేమ, కుటుంబం, బాధ్యతలు వంటి అంశాల మేళవింపుగా సాగే ఈ చిత్రం హీరో-విలన్ల మధ్య నడిచే కథ కాదు.. ఇదొక అందమైన ప్రయాణం,” అని ఆయన పేర్కొన్నారు. తాను అమెరికాలో చదువుకున్నప్పటి అనుభవాలకు, లండన్ నేపథ్యంలో సాగే ఈ కథకు చాలా దగ్గర పోలికలు ఉన్నాయని తెలిపారు. “విదేశాల్లో కుటుంబానికి దూరంగా ఉంటూ, ఆర్థిక సమస్యలను అధిగమించి స్థిరపడాలనుకునే ఎంతోమంది యువతకు ఈ కథ కనెక్ట్ అవుతుంది. సినిమాలో హీరో ఓ అమ్మాయితో కలిసి నివసిస్తాడు. నా నిజ జీవితంలో ఆ ఒక్కటి మినహా, మిగిలినదంతా నా కథే” అని ఆనంద్ వివరించారు. లివ్-ఇన్ రిలేషన్‌షిప్ నేపథ్యం ఉన్నప్పటికీ, దర్శకుడు ఆదిత్య హాసన్ ఎక్కడా ఇబ్బందికరంగా లేకుండా, కుటుంబ ప్రేక్షకులు సైతం వీక్షించేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారని ఆయన భరోసా ఇచ్చారు. సాధారణంగా ఇంట్లో సినిమా విషయాలు పెద్దగా చర్చించుకోమని, అయితే తన సోదరుడు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తనకు ఎప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. ఇటీవల తనకు, దర్శకుడు సందీప్ రెడ్డి వంగాకు వారు వాచీలను బహుమతిగా ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం తాను ‘తక్షకుడు’ అనే మిస్టికల్ థ్రిల్లర్‌లో అంధుడి పాత్రలో నటిస్తున్నానని, అలాగే మరో ఇండో-కొరియన్ ప్రాజెక్ట్ చర్చల దశలో ఉందని తన భవిష్యత్ చిత్రాల గురించి వెల్లడించారు.

# ‘ది ప్యారడైజ్’ చిత్రీకరణ పూర్తి.. నాని కొత్త పోస్టర్ రిలీజ్!

నేచురల్ స్టార్ నాని హీరోగా, యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ది ప్యారడైజ్’ షూటింగ్ పూర్తి చేసుకుంది. ‘దసరా’ వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న రెండో సినిమా కావడంతో దీనిపై ప్రేక్షకుల్లో, ఇండస్ట్రీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. చిత్ర యూనిట్ సినిమా మొత్తం చిత్రీకరణను విజయవంతంగా ముగించినట్లు సమాచారం. ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. అంతకంటే ఒకరోజు ముందుగా, అంటే సెప్టెంబర్ 23న ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నారు. గురువారం చిత్ర యూనిట్ నానికి సంబంధించిన ఒక కొత్త పోస్టర్‌ను విడుదల చేసి అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ పోస్టర్‌లో నాని పొడవాటి జుట్టు, గుబురు గడ్డంతో పీరియడ్ రగ్డ్ లుక్‌లో కనిపిస్తున్నారు. చేతిలో భారీ తుపాకీ పట్టుకుని, తీవ్రమైన చూపులతో ఆకట్టుకుంటున్నారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తన మొబైల్ ఫోన్ నుంచి తీసిన స్క్రీన్‌షాట్‌ను పోస్టర్‌గా విడుదల చేసినట్టు తెలుస్తోంది.ఇప్పటికే విడుదలైన ‘ది ప్యారడైజ్’ టీజర్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. పీడిత ప్రజల తిరుగుబాటు నేపథ్యంలో ఈ సినిమా సాగనుందని టీజర్ స్పష్టం చేసింది. “ఇకపై ఈ నేల ఎవరిది?”, “అసహ్యించుకున్న నలుపే మా జెండా.. కాకి మా చిహ్నం” వంటి సంభాషణలు, రక్తపాతంతో కూడిన యాక్షన్ సన్నివేశాలు సినిమా ఎంత తీవ్రంగా ఉండబోతోందో సూచించాయి. ఈ చిత్రంలో సీనియర్ నటుడు మోహన్ బాబు ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.వాస్తవానికి ఈ సినిమాను మొదట మార్చి 26న, ఆ తర్వాత ఆగస్టు 21న విడుదల చేయాలని భావించినప్పటికీ, పలు కారణాలతో సెప్టెంబర్ 24కి వాయిదా పడింది. ఎట్టకేలకు షూటింగ్ పూర్తి కావడంతో, ఇక ప్రమోషన్ల జోరు పెంచి సినిమాను ప్రేక్షకుల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు యూనిట్ సిద్ధమవుతోంది.





# ఆడవాళ్ల సినిమా.. రూమ్‌లో అందరూ పురుషులే!: ఇండస్ట్రీ తీరుపై ‘దంగల్’ నటి ఆవేదన

**సినీ పరిశ్రమలో పితృస్వామ్యంపై దంగల్ నటి ఫాతిమా సనా షేక్ వ్యాఖ్యలు**

**పురుషాధిక్యతకు పురుషులతో పాటు మహిళలు కూడా కారణమేనన్న ఫాతిమా**

**మహిళా సాధికారత కథల చర్చల్లో ఒక్క మహిళ కూడా ఉండరని వెల్లడి**

**ప్రతి మహిళా తన కోసం తాను పోరాడాలని పిలుపు**

**‘హుంకార్’ వెబ్ సిరీస్‌లో పోలీస్ అధికారిగా కనిపించనున్న నటి**

‘దంగల్’ చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న బాలీవుడ్ నటి ఫాతిమా సనా షేక్, సినీ పరిశ్రమలో వేళ్లూనుకుపోయిన పితృస్వామ్యం, లింగ వివక్షపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తన తాజా వెబ్ సిరీస్ “హుంకార్-ది రోర్” ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడుతూ.. పరిశ్రమలో మహిళలు తమ గొంతు వినిపించడానికి ఎంతగా పోరాడాల్సి వస్తుందో వివరించారు.పితృస్వామ్య ధోరణులకు కేవలం పురుషులను నిందించడం సరికాదని, ఈ వ్యవస్థలో మహిళలు కూడా భాగమేనని ఫాతిమా స్పష్టం చేశారు. “ఈ పితృస్వామ్యం పురుషుల తప్పు మాత్రమే కాదు. ఇందులో మహిళలు కూడా ఉన్నారు. మనందరం ఒకే రకమైన సామాజిక వాతావరణంలో పుట్టి పెరుగుతాం. అందుకే అది మనలో అంతర్లీనంగా పాతుకుపోయింది. దీనిపై మనమంతా పోరాడాలి” అని ఆమె అన్నారు.పరిశ్రమలో తనకు ఎదురైన ఓ అనుభవాన్ని ఫాతిమా పంచుకున్నారు. మహిళా సాధికారతకు సంబంధించిన కథల చర్చలకు పిలిచినప్పుడు, ఆ గదిలో తాను తప్ప మరో మహిళ ఉండేది కాదని గుర్తుచేసుకున్నారు. “నిర్మాత వచ్చి ఇది మీకోసం అద్భుతమైన సినిమా అంటారు. మహిళ తన గొంతును వెతుక్కునే పాత్ర అని చెబుతారు. కానీ ఆ గదిలో నిర్మాత, దర్శకుడు, రచయిత అంతా మగాళ్లే ఉంటారు” అని ఆమె వివరించారు. అలాంటి సందర్భాల్లో తాను ఏదైనా సూచన ఇవ్వబోతే, వారు దాన్ని తీసుకోలేరని, వింత జోకులు వేస్తారని, మహిళల భావాలు ఎలా ఉంటాయో తమకే వివరిస్తారని (మాన్‌స్ప్లెయిన్) ఆవేదన వ్యక్తం చేశారు. హింసాత్మక ఘటనల విషయంలో కూడా మహిళల ఫీలింగ్స్ గురించి పురుషులే పాఠాలు చెబుతారని, అది పెద్ద విషయం కాదన్నట్టు మాట్లాడతారని ఆమె పేర్కొన్నారు.ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవాలంటే ప్రతి మహిళా తన కోసం తాను నిలబడటం, పోరాడటం నేర్చుకోవాలని ఫాతిమా పిలుపునిచ్చారు. ఇక ఆమె నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ ‘హుంకార్-ది రోర్’ విషయానికొస్తే.. ఇది ఒక కోర్ట్ రూమ్ డ్రామా. ఇందులో ఫాతిమా నిజాయతీ గల పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఈ సిరీస్‌ను ప్రియాంక చోప్రాకు చెందిన పర్పుల్ పెబుల్ పిక్చర్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్, బిర్లా స్టూడియోస్, మంగత ఫిల్మ్స్ ప్రొడక్షన్ సంయుక్తంగా నిర్మించాయి. కరణ్ డి. కపాడియా, నిత్యా మెహ్రా దర్శకత్వం వహించిన ఈ సిరీస్, సెప్టెంబర్ 25 నుంచి ‘జియోహాట్‌స్టార్’ (జీఅశీఎశేఖతీ)లో స్ట్రీమింగ్ కానుంది.

Edited, Printed,Published and Owned by **V. Madhusudan chary** , Lake view krishna residency.Flat no 102.Road no 4 Jaya nagarNear Ganesh Mandapam Kukatpally Telangana 500072, Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, **PRGI TGTEL/26/A3129** Cell.No 9966555449